

రథంపై ఉత్సవమూర్తులు



వేడుకల్లో ఆలయ ఈఓ, శ్రీశైల పీఠాధిపతి



మహిళల కోలాటం



ఉత్సవాల్లో భాగంగా యువకులు



వివిధ వేషధారణల్లో కళాకారులు



కర్ణాటక కళాకారుల ప్రదర్శన



భారీగా తరలి వచ్చిన భక్తులు

వైభవంగా ఆదిదంపతుల రథోత్సవం

- అశేషంగా తరలి వచ్చిన భక్తులు
- రమావాణి సేవిత రాజరాజేశ్వరి అలంకారంలో భ్రామరి
- నేడు స్వామిఅమ్మవార్లకు అశ్వ వాహన సేవ
- నిజాలంకరణలో దర్శనమివ్వనున్న అమ్మవారు

శ్రీశైలం, ఏప్రిల్ 9: ఉగాది మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని దేవదేవులకు వైభవంగా రథోత్సవం జరిగింది. సాయంత్రం రథశాల వద్ద ఆలయ అర్చకులు రథానికి రథాంగ పూజ, రథాంగ హోమం, రథాంగ బలి కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి ఉభయ దేవాలయ ప్రాంగణంలో విశేష అర్చనలు, హారతులందుకున్న స్వామి, అమ్మవార్లను పల్లకిలో రాజగోపురం మీదుగా రథశాల వద్దకు మేళతాళాలు, భజంత్రీల నడుమ తోడ్కొని వచ్చారు. పుష్ప ప్రియుడైన మల్లయ్యకు సుగంధ పుష్పాలు, పరిమళ ద్రవ్యాలతో అలకంరించిన రథంపై ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేసి సాత్విక బలిగా కొబ్బరికాయలను, గుమ్మడికాయలను సమర్పించారు. గంగాధర మండపం నుంచి నంది మండపం దాకా, అక్కడి నుంచి తిరిగి గంగాధర మండపం వరకు రథోత్సవం సాగింది. రథంపై ఆదిదేవులు ఆశీనులై సాగుతుండగా భక్తులు మల్లయ్య శ్రీగిరి మల్లయ్య నామస్మరణ చేస్తూ ఆది దేవుల వైభవాన్ని కల్లారా వీక్షిస్తూ పరవశించారు. రథం ముందు కోలాటం, కర్ణాటక జాంజ్, వీరగాసి, కొమ్ము వాయిద్యం, నందికోలు సేవ, బీరప్పడోలు, పగటి వేషధారణ ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. రథోత్సవంలో అధికారులు, శ్రీశైల జగద్గురు పీఠాధిపతి, ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను శ్రీశైల జగద్గురు పీఠాధిపతి చెన్న సిద్ధరామ పండితారాధ్యా శివాచార్య మహాస్వామీజీ దర్శించుకున్నారు. అదేవిధంగా నంద్యాల జిల్లా జయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి దర్శించుకుని పల్లకీ సేవలో పాల్గొన్నారు.

శ్రీశైలంలో పంచాంగ శ్రవణం

శ్రీశైల మహా క్షేత్రంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం ఆలయ ప్రాంగణంలోని నిత్య కల్యాణ మండపంలో పంచాంగ పఠనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీశైల దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి పండిత బుట్టే వీరభద్ర దైవజ్ఞ, రాజమండ్రి వారు పంచాంగ శ్రవణం చేశారు. పంచాంగ శ్రవణం కంటే ముందు లోకకళ్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు, వేదపండితులు దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగిన వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికీ ఆయురారోగ్యాలు కలగాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, అన్ని సామాజిక వర్గాలు సుఖసంతోషాలతో ఉండాలని సంకల్పాన్ని పఠించారు. తరువాత స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం నూతన పంచాంగానికి పూజలు చేశారు. కార్యనిర్వాహణాధికారి డి. పెద్దిరాజు దేవస్థానం తరపున ఆస్థాన సిద్ధాంతి పండిత బుట్టే వీరభద్ర దైవజ్ఞ వారికి స్వామి, అమ్మవార్ల ప్రసాదాలను, శేషవస్త్రాలను అందజేసి పంచాంగ పఠనానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సిద్ధాంతి క్రోధినామ సంవత్సర విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశమంతటా సగటు వర్షపాతం నమోదవుతుందన్నారు. ఉత్తరాదిన నదులన్నీ పొంగి ప్రవహిస్తాయని తెలిపారు. అలాగే దేశంలో ఆహారధాన్యాలు సమృద్ధి ఉంటాయన్నారు. పల్లపు భూములు విశేషంగా పండుతాయన్నారు. మిర్చి, పత్తి, పొగాకు, ఎరుపు ధాన్యాలకు మంచి దిగుబడి ఉందని చెప్పారు. నూనెగింజల ఉత్పత్తులు పెరుగుతాయ్నారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు, దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



క్రోధినామ సంవత్సర విశేషాలను వివరిస్తున్న దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి పండిత బుట్టే వీరభద్ర దైవజ్ఞ

రమావాణీసేవిత రాజరాజేశ్వరి అలంకరణలో అమ్మవారు

ఉగాది ఉత్సవాల్లో అమ్మవారి అలంకారాలలో భాగంగా మంగళవారం రమావాణీసేవిత రాజరాజేశ్వరీ అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ముందుగా అర్చకులు అమ్మవారి ఉత్సమూర్తికి రమావాణీ సేవిత రాజరాజేశ్వరి అలంకారం చేసి విశేష పూజలు చేసి మంగళ హారతులు ఇచ్చారు.

నేడు అశ్వవాహన సేవ : ఉగాది ఉత్సవాల్లో చివరి రోజు బుధవారం భ్రమరాంబదేవి నిజాలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. రాత్రి స్వామి అమ్మవార్లకు అశ్వవాహన సేవ ఆలయ ఉత్సవం నిర్వహించనున్నారు.



రమావాణి సేవిత రాజరాజేశ్వరి అలంకారంలో భ్రామరి, పూజలు చేస్తున్న అర్చకులు



శాతనకోట వద్ద కృష్ణానదిలో ఇసుక తిన్నెలు

నదిని కొల్లగొడుతున్నారు

- ఏటికి ఇరువైపులా రాత్రింబవళ్లు
- తుంగభద్ర నుంచి ఇసుక అక్రమ రవాణా
- పట్టించుకునేవారే లేరు

నందికొట్కూరు ఏప్రిల్ 9:

నదీ గర్భంలోని ఇసుక అక్రమార్కుల సంపదగా మారుతోంది. పగలూ రాత్రీ తేడా లేకుండా ఎవరికి తోచినట్లు వాళ్లు ఏటిని కొల్లగొడుతున్నారు. ఈ సంగతి అధికారులకు తెలుసు. అయినా పట్టించుకోరు. దేనికంటే నదిలోంచి ఎన్ని ట్రాక్టర్ల ఇసుక తరలిపోతే అంత ఎక్కువ సొమ్ము అధికార పార్టీ నాయకుల చేతిలోపడుతుంది. దీంతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డే లేకుండాపోయింది. కృష్ణా నది ఉనికే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది.

నందికొట్కూరులో అక్రమ ఇసుక వ్యాపారం జోరుగా సాగుతోంది. ట్రాక్టర్లతో అయితే కొద్దిగానే లాభం వస్తుందని, ఏకంగా టిప్పర్లతో అక్రమ రవాణా సాగిస్తున్నారు. ప్రభుత్వం ఇసుక సరఫరాను నిలిపివేయడంతో అక్రమ వ్యాపారం పెరిగిపోయింది. పగలు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర సరిహద్దు గ్రామాలైన పూడూరు, రాలెంపాడు గ్రామాల నుంచి, రాత్రిళ్లు కర్నూలు జిల్లాలోని శాతనకోట గ్రామం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ధనార్జనే ధ్యేయంగా ఇసుక అక్రమ మార్గాన్ని ఎన్నుకున్న కొందరు గత రెండు మూడు రోజుల నుంచి ఏకంగా టిప్పర్లతో ఇసుక అక్రమ వ్యాపారానికి తెరలేపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్నా పట్టించుకునేవారే లేరు.

● పగలంతా ఆంధ్ర- తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో: నందికొట్కూరు నియోజకవర్గం తెలంగాణ - ఆంధ్ర రాష్ట్రాలకు సరిహద్దు ప్రాంతంలో కృష్ణా నది ప్రవహిస్తోంది. ఇక్కడ శ్రీశైలం నీటి మట్టం అడుగంటడంతో ఇసుక తిన్నెలు బయటపడ్డాయి. నియోజకవర్గంలో ఇసుకను ప్రభుత్వం అందించే కాంట్రాక్టు గడువు ముగిసింది. గృహ నిర్మాణాలకు ఇసుక వినియోగం డిమాండ్ బాగా పెరిగింది. దీంతో ఇసుకాసురులు నదిని తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టరు ఇసుక తరలించాలంటే రూ.1300 చొప్పున అధికారపార్టీకి చెందిన ఓ నాయకుడు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇసుక లోడ్ చేసేందుకు ఈ గ్రామాలకు చెందిన దాదాపు 50 మంది కూలీలు వెళ్తున్నారు. వారికి రూ.1000 చొప్పున కూలీ చెల్లిస్తున్నారు. కేసీ కాలువ వెంట నందికొట్కూరు పట్టణం మీదుగా ఇతర ప్రాంతాలకు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తీసుకువెళ్లి అమ్ముకుంటున్నారు. శాతనకోట, జంగంపాడులలో రెవిన్యూ మైనింగ్ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నారు. పగలంతా ఆంధ్రా, తెలంగాణ సరిహద్దు గ్రామాలైన పడిదెంపాడు, పూడూరు, ర్యాలెంపాడు గ్రామాల సరిహద్దుల నుంచి నదిలోని ఇసుకను తవ్వి ట్రాక్టర్ల ద్వారా నందికొట్కూరు నియోజకవర్గంలోని దాదాపు అన్ని మండలాలకు అక్రమంగా తరలిస్తున్నారు. రోజుకు ఒక్కో ట్రాక్టరు రెండు లేదా మూడు ట్రిప్పుల చొప్పున దాదాపు 40 ట్రాక్టర్లు తిరుగుతున్నట్లు సమాచారం. పడిదెంపాడు, పూడూరు సరిహద్దుల్లో లోడ్ చేసుకొని, ర్యాలెంపాడు, జిల్లపాడు మీదుగా అల్లూరు చేరుకొని అక్కడి నుంచి నందికొట్కూరుకు రోడ్డు మార్గంలో ట్రాక్టర్లు పట్టపగలే తరలి వెళుతున్నాయి.

అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటాం

కృష్ణానదిలో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాము. శాతనకోట, మల్యాల గ్రామాల సరిహద్దులో కేసీ కాలువ పక్కన ఇసుక డంప్ ఉన్నట్లు సమాచారం వచ్చింది. అక్రమంగా నిల్వ ఉన్న ఇసుక డంప్‌ను సీజ్ చేస్తాము. శాతనకోట, జంగంపాడు గ్రామాల పరిధిలోని కృష్ణానదిలో ఇసుకను అక్రమంగా తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

-దామోదర్‌రెడ్డి, నందికొట్కూరు తహసీల్దార్



రాత్రిళ్లు శాతనకోట: నందికొట్కూరు నియోజకవర్గంలోని శాతనకోట పంచాయతీకి మజరా గ్రామమైన జంగంపాడు గ్రామాల్లోని నదీ తీర ప్రాంతంలో ఇసుక తిన్నెలు భారీగా ఉన్నాయి. గత వారం పది రోజుల క్రితం జంగంపాడు గ్రామంలో ఇసుకను తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకొన్నారు. పక్కనే ఉన్న శాతనకోట సమీపంలోని నదీ తీరంలో ఇసుకను అక్రమంగా తవ్వేందుకు శ్రీకారం చుట్టారు. అక్కడ కూడా గ్రామస్తులు అడ్డుకోవడంతో పగటిపూట ఇసుకను తరలించడం నిలిపివేశారు. పూడూరు, పడిదెంపాడు, ర్యాలెంపాడు గ్రామాల సరిహద్దుల్లో నుంచి ఇసుకను పగటిపూట తరలిస్తూ... రాత్రి 10 గంటల నుంచి ఇసుకాసురుల బయటకు వస్తు న్నారు. రాత్రంతా నదిలోని ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసు కుంటు న్నారు. ఎవరు ఎన్ని చెప్పినా పూడూరు, పడిదెంపాడు సరి హద్దుల్లో నుంచి ఇసుక యథేచ్ఛగా నియోజకవర్గంలోకి వస్తోంది. ఈ ఇసుకను తరలించే ట్రాక్టర్లు అన్ని నందికొట్కూరుకు చెందినవి కావడం విశేషం.

ఏకంగా టిప్పర్లతో అక్రమ వ్యాపారం

ట్రాక్టర్లతో ఆదాయం తక్కువగా ఉంటుందనుకున్నారో ఏమో. ట్రాక్టర్లతో నదిలో నుంచి ఇసుకను ఒక చోట డంప్ చేయించి, అక్కడి నుంచి టిప్పర్లకు ఎక్స్‌కవేటర్‌తో లోడ్ చేయించి వ్యాపారం చేస్తున్నారు. ఈ వ్యవహారం రెండు మూడు రోజులుగా నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని రెవిన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.

పట్టించుకునేవారే లేరు : అక్రమ ఇసుక రవాణాను అడ్డుకునే వారే నియోజకవర్గంలో కరువయ్యారు. పరిసర గ్రామాలకు చెందిన వారు ఫిర్యాదులు చేస్తే ఆ పూటకు ట్రాక్టర్లు నిలిచిపోతున్నాయని, ఆ తర్వాత తిరిగి ఇసుక రవాణా జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. పట్టపగలే పట్టణంలో ఇసుక ట్రాక్టర్లు తిరుగుతున్నా పోలీసులకు కనిపించడం లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఎన్‌ఎండీ ఫరూక్‌కు గాయాలు

- బర్రెలను కారు ఢీకొనడంతో ప్రమాదం
- బెలూన్లు తెరుచుకోవడంతో తప్పిన ప్రాణాపాయం
- పరామర్శించి ఆసుపత్రికి తరలించిన గౌరు చరిత

పాణ్యం, ఏప్రిల్ 9: మండలంలోని తమ్మరాజుపల్లె వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నంద్యాల అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి ఎన్‌ఎండీ ఫరూక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. రంజాన్ వేడుకల్లో పాల్గొనడానికి హైదరాబాదు వెళ్తున్న ఆయన కారుకు ఉన్నట్టుండి బర్రెలు అడ్డంగా వచ్చాయి. వేగంగా కారు వాటిని ఢీకొట్టింది. బెలూన్లు తెరుచుకోవడంతో ఫరూక్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సీటు బెల్టు పెట్టుకోవడం వల్ల ప్రాణాపాయం తప్పింది. మూడు బర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో బర్రె తీవ్రంగా గాయపడింది. ఈ ఘటనలో కారు పూర్తిగా ధ్వంసమైంది. పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరితకు విషయం తెలియడంతో ప్రమాద స్థలానికి చేరుకొని ఫరూక్‌ను పరామర్శించారు. అనంతరం అక్కడకు చేరుకున్న ఎన్‌హెచ్ హైవే సిబ్బంది ఫరూక్‌కు ప్రథమ చికిత్స చేసి నంద్యాలలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్దఎత్తున సంఘటనా స్థలానికి చేరుకొని ఆయనను పరామర్శించారు.



ఘటనా స్థలంలో ఫరూక్‌ను పరామర్శిస్తున్న గౌరు చరిత

పరిహారం ఇప్పించండి: బర్రెలు మృతి చెందడంతో తాను జీవనోపాధి కోల్పోయానని పాణ్యం సురేష్ పేర్కొన్నాడు. పొలం నుంచి ఇంటికి బర్రెలను తోలుకొని వస్తుండగా వాహనాల హారన్‌కు బెదిరి పరిగెత్తాయని, దీంతో కారు ఢీకొందని తెలిపాడు. మృతి చెందిన బర్రెల విలువ రూ.3 లక్షలు ఉంటుందన్నా రు. మరో బర్రె ప్రాణాలతో కొట్టుమిట్టాడుతోందని తెలిపాడు. నాకు నష్ట పరిహారం ఇప్పించాలని స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.



ప్రమాదంలో ధ్వంసమైన కారు


చౌడేశ్వరి దేవి



ఘనంగా చౌడేశ్వరీ దేవి జ్యోతి మహోత్సవాలు

● ప్రత్యేక ఆకర్షణగా ఎద్దులబండ్ల ప్రదర్శన
● వేడుక చూసేందుకు తరలివచ్చిన భక్తులు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తురాలు



కల్లూరు, ఏప్రిల్ 9: ఉగాది పర్వాదినాన్ని పురస్కరించుకుని కల్లూరు చౌడేశ్వరీదేవి ఆలయంలో జ్యోతి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం ఆలయ కార్యనిర్వహణ అధికారి గుర్రెడ్డి, చైర్మన్ పోలిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భక్తుల దర్శనార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేయగా భక్తులు పెద్దఎత్తున పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆలయంలో పంచాంగ పఠనం, అమ్మవారి నక్షత్ర దీపోత్సవం, శకటోత్సవ సేవలు నిర్వహించారు. కల్లూరులోని చౌడేశ్వరీదేవి ఆలయంలో సాంప్రదాయ బద్ధంగా వస్తున్న అమ్మవారి ఆలయం చుట్టూ ఎద్దుల బండ్లు, గాడిదలతో ప్రదక్షిణ చేయడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా ఆలయ నిర్వాహకులు గత రెండ్రోజుల క్రితం ఆలయం చుట్టూ నీరు వదిలి బురదమట్టి తయారు చేశారు. ప్రతి ఏడాది వర్షాలు సకాలంలో కురవాలి, పాడి పంటలు సమృద్ధిగా పండాలి, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్న సంకల్పంతో గ్రామపెద్దలు దశాబ్దాలుగా ఈ ఆచారాన్ని సాగిస్తున్నారు. ఈ మేరకు కల్లూరు ప్రాంత రైతులు ప్రతి ఏడాది ఎద్దుల బండ్లతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుకను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉగాది ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా ఎద్దుల బండ్ల ప్రదర్శన నిలవగా కేరింతలు కొడుతూ రైతులు తమ ఎద్దులతో అమ్మవారి ఆలయం చుట్టూ బండ్లు తిప్పడం విశేషం. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కల్లూరు చౌడేశ్వరిదేవి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చౌడేశ్వరిదేవి జ్యోతిమహోత్సవాల్లో భాగంగా బుధవారం తెల్లవారు జామున కల్లూరులోని ఊరువాకిలి నుండి జ్యోతులు అమ్మవారి చెంతకు బయలుదేరనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


చౌడేశ్వరి దేవి ఆలయం చుట్టూ వదిలిన నీటితో చిన్నారుల కోలాహలం


అమ్మవారి ఆలయం చుట్టూరు ఎద్దుల బండ్ల పోటీల్లో యువకుల ఉత్సాహం


చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలకు తరలి వచ్చిన భక్తులు


చౌడేశ్వరి దేవి ఆలయం చుట్టూ తిరుగుతున్న ఎద్దుల బండ్లు

జగన్‌కు ఓటమి భయం : టీడీపీ

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బస్తిపాటి నాగరాజు, బీవీ జయనాగేశ్వరరెడ్డి


మాట్లాడుతున్న జయనాగేశ్వరరెడ్డి, నాగరాజు

గోనెగండ్ల, ఏప్రిల్ 9: సీఎం జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే, కర్నూలు ఎంపీ అభ్యర్థులు బీవీ జయనాగేశ్వరరెడ్డి, బస్తిపాటి నాగరాజు అన్నారు. మంగళవారం గోనెగండ్ల మండల పరిధిలోని గాజులదిన్నె గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎంపీపీ హనుమంతును వారు పరామర్శించారు. అనంతరం పిల్లిగుండ్ల గ్రామంలోని టీడీపీ నాయకుడు ఉల్లిగడ్ల రాముడును పరామర్శించారు. ఈ సందర్భంగా బస్తిపాటి నాగరాజు, బీవీ జయనాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ అవినీతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను సాగనంపేందుకు ప్రజలు సిద్ధమయ్యారన్నారు. బీసీలకు జగన్ ప్రభుత్వంలో తీరని అన్యాయం జరిగిందన్నారు. జగన్ ఓటమి భయంతోనే బీసీల రాగం పాడుతున్నాడన్నారు. జగన్ మాటలను నమ్మేస్థితిలో బీసీలు లేరన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్‌డీఎస్ పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తామన్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. క టీడీపీ అధికారంలోకి వచ్చిన మహిళలకు ఏడాదికి మూడు సిలిండర్‌లు ఉచితంగా ఇస్తామన్నారు. మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం, 18 ఏళ్ల దాటిని మహిళలకు నెలకు రూ. 1500, నిరుద్యోగులకు నెలకు రూ. 3000 ప్రతి గ్రామానికి తాగునీరు, రోడ్ల సమస్య లేకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత మాజీ ఉపాధ్యక్షుడు రామకృష్ణ, మాజీ సర్పంచ్ సంజన్న, వేణుగోపాలాచారి, ప్రభాకర్, చంద్ర, యాకోబు, నజీర్‌సాహెబ్, తిరుపతయ్యనాయుడు, జయపాల్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ఉగాది బ్రహ్మోత్సవాలు ప్రారంభం


ఆలయం చుట్టూ పన్నేరపు బండ్లు తిప్పుతున్న రైతులు

బనగానపల్లె రూరల్, ఏప్రిల్ 9: జిల్లాలోని నందవరం చౌడేశ్వరీదేవి ఆలయంలో మంగళవారం నుంచి ఉగాది బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వహణాధికారి జి.కామేశ్వరమ్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఉగాది ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఉదయం 6 గంటలకు అమ్మవారికి మహా మంగళహారతి, గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఆలయ ఆవరణలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. అమ్మవారి దర్శనార్థం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సాయంత్రం మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామానికి చెందిన రైతులు సాంప్రదాయంగా ఎండ్ల బండ్లను ప్రత్యేకంగా అలంకరించి ఆలయం చుట్టూ పన్నేరపు బండ్లు తిప్పారు. 6.30 గంటల ప్రాకార రథోత్సవం నిర్వహించారు. రాత్రి ఏర్పాటు చేసిన పౌరాణిక నాటక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

నేడు శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం : ఉగాది ఉత్సవాల్లో భాగంగా నందవరం గ్రామంలో రెండో రోజు బుధవారం రాత్రి 9 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం చౌడేశ్వరీదేవికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాత్రి కల్యాణోత్సవం అనంతరం స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం ఉంటుందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ జి.కామేశ్వరమ్మ తెలిపారు. రాత్రి 10గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

నేడు పిడకల సమరం

● కైరుప్పలలో సిద్ధం

ఆస్పరి, ఏప్రిల్ 9: ఉగాది పండుగ సందర్భంగా ఆస్పరి మండలం కైరుప్పలలో జరిగే పిడకల సమరానికి ఓ ప్రత్యేకత ఉంది. పండుగ మరుసటి రోజు ఏటా ఈ వేడుక జరుగుతుంది. బుధవారం కైరుప్పల గ్రామంలో పిడకల సమరం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ వేడుకలో పాల్గొనడానికి సమీప గ్రామాలైన పుష్పాలదొడ్డి, చెన్నంపల్లి, వెంగళాయదొడ్డి, కారుమంచి, కలపరి, వలగొండ, పుటకలమర్రి, యాటకల్లు వస్తారు. వారు రెండు వర్గాలుగా విడిపోయి పిడకలతో కొట్టుకోవడం, అనంతరం కలిసిపోవడం ఆచారంగా వస్తోంది. ఈ పిడకల సమరాన్ని తిలకించేందుకు మండలంలోని గ్రామాల ప్రజలతో పాటు ఇతర రాష్ట్రాల నుండి కూడా జనం తరలివస్తారు. వీరభద్రస్వామి, భద్రకాళి ప్రేమాయణంలో తలెత్తిన ఓ చిన్న వివాదానికి గుర్తుగా దీన్ని జరుపుకుంటారు. ఉదయం ప్రత్యేక పూజలు చేస్తారు. సాయంత్రం పుష్పాలదొడ్డి, చెన్నంపల్లి గ్రామస్తులు తమ గ్రామదేవతలను పల్లకిలో కైరుప్పల ఆలయంలోకి తీసుకొస్తారు. అప్పటికే ఆలయంలో సిద్ధంగా ఉంచిన పడకలను రెండు వర్గాల వారు ఒకరిపై ఒకరు విసురుకుంటారు. ఈ పిడకల సమరం ఒళ్లు గగుర్పొడిచేలా దాదాపు గంటపాటు సాగుతుంది. దీన్ని పెద్ద నుగ్గులాట అని కూడా అంటారు. పుష్పాలదొడ్డి గ్రామంలో చిన్న నుగ్గులాట మంగళవారం నిర్వహించారు. గ్రామంలో వెలసిన గిడ్డయ్యస్వామి వారి పల్లకి ఉత్సవాలు కల్లపరి, వెంగళాయదొడ్డి గ్రామ పొలిమేర చుట్టూ సాగింది.


ఆలయ ప్రాంగణంలో సమరానికి సిద్ధంగా ఉంచిన పిడకలు

గన్‌తో బెదిరింపులు

● ఎన్నికల వేళ కలకలం ● ఆలస్యంగా వెలుగులోకి..

పెద్దకడుబూరు, ఏప్రిల్ 9: భూమి తగాదాలో ఓ వర్గం రైతులు రిటైర్డు పోలీసు అధికారి అండతో అవతలి వాళ్లను గన్‌తో బెదిరించినట్లు ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఆదోని మండలం పెద్దతుంభళం గ్రామానికి చెందిన అల్లయ్యగారి పెద్ద ఉరుకుంద, అల్లయ్య గారి నాగరాజు అన్నదమ్ములు. వీరికి . పెద్దకడుబూరు మండలం హాలికన్వి గ్రామ పరిధిలో సర్వేనెం. 29లో 4.77 ఎకరాల భూమి ఉంది. ఇది పూర్వీకుల నుంచి వీరికి సంక్రమించింది. అయితే ఇటీవల ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేలో ఈ భూమిలో 33 సెంట్ల భూమి ఆక్రమణకు గురైనట్లు బయటపడింది. ఆ భూమిని తమకు అప్పగించాలని ఆక్రమించుకున్న పక్కపొలం వారిని కోరారు. అయితే ఆ భూమి తమదేనని ఆక్రమించుకున్నవారు అన్నారు. దీంతో బాధితులు హైకోర్టుకు వెళ్లారు. దీనిపై కోర్టు స్పందిస్తూ భూమిని సర్వేచేసి బాధితులకు హద్దులు చూపాలని ఆదేశించింది. ఈ మేరకు రెవిన్యూ అధికారులు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసి రాళ్లు పాతారు. ఈ సందర్భంగా అవతలి వాళ్లు రెవెన్యూ, పోలీసు అధికారులను అడ్డుకున్నారు. దీంతో వారిపై అధికారులు కేసు నమోదు చేశారు. దీన్ని లెక్క చేయకుండా ఆక్రమణదారులు రాళ్లను తొలగించారు. అంతేగాక ఈ ఏడాది మార్చి 31వ తేదీన ఓ రిటైర్డ్ పోలీసు అధికారితో పాటు ఆక్రమణదారులు, మరికొందరు వ్యక్తులు పొలం దగ్గరకు గన్‌తో వచ్చి పంచాయితీకి రమ్మని బాధితులను పిలిచారు. అక్కడ ఓ రిటైర్డ్ పోలీసు అధికారి, ఆయనతో పాటు మరో వ్యక్తి గన్ పట్టుకొని బాధితులను, వారి కుటుంబ సభ్యులను బెదిరించారు భూమి వదులుకోకపోతే గన్‌తో లేపేస్తామని తమను బెదిరించినట్లు బాధితులు తెలిపారు. వారు పెద్దకడుబూరు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు మూడు రోజులు స్టేషన్ చుట్టూ తిప్పుకొని చివరకు ఆక్రమణదారులైన ఐదుగురిపై మాత్రమే కేసు నమోదు చేశారు. అయితే తమను బెదిరించిన రిటైర్డ్ పోలీసు అధికారి, ఆయనతోపాటు వచ్చిన గన్ పట్టుకున్న వ్యక్తిని, మరి కొందరిపై కేసు పెట్టలేదని బాధితులు ఆరోపించారు. ఎన్నికల వేళ ఈ గన్ ఉదంతం కలకలం సృష్టించింది. వాస్తవంగా గన్ లైసెన్స్ ఉన్నవారు స్థానిక పోలీసు స్టేషన్‌లో డిపాజిట్ చేయాలి. రిటైర్డ్ పోలీసు అధికారి వద్ద ఉన్న గన్‌కు లైసెన్స్ ఉందా.. లేదా.. ఉంటే స్టేషన్‌లో ఎందుకు డిపాజిట్ చేయలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూ పంచాయతీలో గన్‌తో కలకలం సృష్టించిన వారిపై కేసులు ఎందుకు నమోదు చేయలేదో అంతుబట్టడం లేదు. ఈ విషయంపై పెద్దకడుబూరు ఎస్సై మహేష్‌కుమార్‌ను వివరాలు అడుగగా.. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నామని అన్నారు.


గన్ పట్టుకొని భూమి విషయంలో బాధితులను బెదిరిస్తున్న దృశ్యం

ఏడు జతల పొట్టేళ్లతో రథ యాత్ర


ముత్తలూరులో పొట్టేళ్లతో రథాన్ని లాగిస్తున్న దృశ్యం

రుద్రవరం, ఏప్రిల్ 9 : మండలంలోని ముత్తలూరు గ్రామ సు ్తలు మంగళవారం ఏడు జతల పొట్టేళ్లతో హనుమంతుని రథ యాత్ర నిర్వహించారు. గ్రామం నుంచి నాలుగు కిమీ పొడవునా పొట్టేళ్లు రథాన్ని లాగాయి. రథంలో హనుమంతుని విగ్రహాన్ని ఉంచి యాదవులు ఇలా రథాన్ని లాగించడం ఆనవాయితీ. లింగమయ్య స్వామి దేవాలయానికి రథంతో చేరుకుని అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు నిర్వహించిన కోలాటం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. అలాగే రుద్రవరం, కొండమాయపల్లె ఇంకా పలు గ్రామాల్లో హనుమంతునికి ఆకుపూజ చేసి ప్రత్యేక పూజలు చేశారు.

తండ్రిని చంపిన తనయుడు

మిడుతూరు, ఏప్రిల్ 9: ఆస్తి కోసం ఓ కొడుకు తండ్రిని హత్య చేశాడు. ఈ ఘటన మిడ్తూరు మండలం తలముడిపి గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన కురువ అయ్యన్న(85)కు ఇద్దరు కుమారులు. ఇంటిని పంచి ఇవ్వాలని చిన్న కుమారుడు శ్రీనివాసులు చాలా కాలం నుంచి తండ్రి అయ్యన్నను కోరుతున్నారు. అయితే కుమారుడికి చెడు అలవాట్లు ఉండటంతో ఇల్లు పంచి ఇస్తే అమ్మేస్తాడని అయ్యన్న అంగీకరించలేదు. ఈ విషయంలో సోమవారం శ్రీనివాసులు కోపంతో కర్రతో తండ్రి తల మీద కొట్టాడు. తీవ్ర గాయాలపాలైన అయ్యన్నను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆయన కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతడి పెద్దకుమారుడు బాలుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మిడ్తూరు ఎస్.ఐ జగన్మోహన్ తెలిపారు.

రైలు నుంచి జారి పడి యువకుడి మృతి

కోసిగి, ఏప్రిల్ 9: మంగళవారం తెల్లవారుజామున కోసిగి మండలం కుప్పగల్ ఆర్ఎస్‌ల మధ్య కేఎం.నెం.520/11-09 వద్ద బీహార్ రాష్ట్రానికి చెందిన తునిలాల్ మాంజి (25) అనే యువకుడు ప్రమాదవశాత్తు రైలు నుండి జారి పడి మృతి చెందాడు. ఆదోని రైల్వే ఎస్ఐ గోపాల్ ఈ విషయం తెలిపారు. రైలు.నెం.12617 నుంచి డౌన్ లైన్ నుంచి ఎగిరి అప్‌లైన్ ట్రాక్‌లో పడి తీవ్ర రక్తగాయాలతో మాంజి మృతి చెందాడని ఆయన తెలిపారు. మృతుని వద్ద బెంగుళూరు నుంచి న్యూఢిల్లీ వెళ్లే రైల్వే జనరల్ టికెట్ ఉందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆటో ప్రమాదంలో ఒకరు మృతి

ముగ్గురికి గాయాలు

కోవెలకుంట్ల, ఏప్రిల్ 9: అదుపుతప్పి ఆటో బోల్తాపడటంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కోవెలకుంట్ల పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. కోవెలకుంట్లకు చెందిన చుక్కా సుబ్బరాయుడు, చుక్కా రాజు, కంపమల్ల జయన్న, మరొక వ్యక్తితో కలిసి ఆటోలో అమడాలకు వెళ్లి అక్కడ పని ముగించుకుని తిరిగి కోవెలకుంట్లకు బయల్దేరాడు. నాట్ల వెంకటేశ్వర రెడ్డి ఇంటి సమీపంలోకి వచ్చేసరికి ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో చుక్కా సుబ్బరాయుడు (52)అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న మిగతా ముగ్గురు గాయపడ్డారు. సుబ్బరాయుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వరప్రసాద్ తెలిపారు.

వైభవంగా ఉగాది

● భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు ● రంగులు చల్లుకొని వేడుకలు ● అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు


నంద్యాలలో రంగులు చల్లుకుంటున్న యువకులు


నంద్యాలలోని భద్రావతీ భావనారుషి ఆలయంలో..


ఆత్మకూరులో..


వెలుగోడు మండలంలో..


కొత్తపల్లి: గువ్వలకుంట్లలో..


మిడుతూరులో..


మహానందిలో పంచాంగ పఠనం చేస్తున్న రవిశంకర అవధాని


పగిడ్యాల: నెహ్రూనగర్‌లో సుంకులమ్మకు పూజలు

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 9: నంద్యాల జిల్లాలోని అన్ని దేవాలయాల్లో మంగళవారం శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహించారు. శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలలో భాగంగా ఆలయాలలో అర్చకులు స్వామివార్లకు నూతన వస్త్రాలంకరణ చేసి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రజలు తమ ఇళ్లకు మావిడి తోరణాలు కట్టుకొని క్రోధినామ సంవత్సర ఉగాది వేడుకలను జరుపుకొన్నారు. జిల్లాలో పలు కూడళ్ల, ఇళ్ల వద్ద చిన్నారులు, ప్రజలు, మిత్రులు రంగులు చల్లుకొని ఉత్సాహంగా వేడుకలను నిర్వహించుకొన్నారు. ఉగాది వేడుకలు ప్రజలు ఇంటివద్ద, ఆలయాలలో షఢ్రుచుల ఉగాది పచ్చడి, తీపి చేసుకుని ఉగాది వేడుకలు జరుపుకొన్నారు.

● నంద్యాల పట్టణంలోని మంగళవారం ఉగాది సందర్భంగా సాయంత్రం సంజీవనగర్ కోదండరామాలయంలో భగవత్ సేవాసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో యడవల్లి కార్తికేయశర్మ, బ్రహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో భద్రావతీ భావనారుషి ఆలయంలో సుదీంద్రాచార్యులు, ఎస్‌బీఐ కాలనీ రామాలయంలో కమిటీ ఆధ్వర్యంలో భార్గవరామ శర్మతో పంచాంగ శ్రవణం నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజలు వారి రాశిఫలాలు తెలుసుకున్నారు. నూతన సంవత్సరంలో అందరికి మంచి జరగాలని ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

నందికొట్కూరు: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గం లోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రజలు ఉదయాన్నే నిద్రలేచి స్నానాలు ఆచరించి పిండివంటలు చేసుకొని దేవాలయాల్లో అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రధానంగా పట్టణ, గ్రామాల్లో సుంకులమ్మ, సవారమ్మ అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నందికొట్కూరులో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని సవారమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలను గ్రామ పెద్దలు నిర్వహించారు.

పగిడ్యాల: మండలంలోని పగిడ్యాల, పాలమర్రి, బీరవోలు, సంకిరేణిపల్లె, ముచ్చుమర్రి, వనములపాడు, నెహ్రూనగర్, లక్ష్మాపురం, ప్రాతకోట, ఘణపురం గ్రామాల్లో శ్రీక్రోధి నామ తెలుగు సంవత్సర ఉగాది పండుగ వేడుకలను భక్తులు మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. ఆయా గ్రామాలో గ్రామదేవతలైన సుంకులమ్మ ఆలయాలల్లో భక్తులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాజభజంత్రీలపై ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనంకుండలతో నైవెద్యాలను సమర్పించారు. సాయంత్రం ఆయా గ్రామాల్లోని ఆలయాల వద్ద పురోహితులు పంచాంగ పఠనం చేశారు.

పాములపాడు: మండలంలోని అన్ని గ్రామాలలో ఉగాది పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పాములపాడులోని చౌడేశ్వరీ దేవిని భక్తులు దర్శించుకున్నారు. భక్తులు గ్రామ దేవతలను దర్శించి నైవేద్యాలు సమర్పించారు. పురోహితుడు కోదండరామయ్య పంచాంగం వినపించారు.

కొత్తపల్లి: ఈ ఏడాది స్వస్థి శ్రీక్రోధి నామసంవత్సరంలో కుజుడు ధాన్యాధిపతి అవడం వల్ల వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండుతాయనీ కొత్తపల్లి, గువ్వలకుంట్ల ఆలయాల పురోహితులు లక్ష్మినరసయ్య శర్మ, రామయ్య శర్మలు తెలిపారు. మంగళవారం సాయంత్రం తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కొత్తపల్లి తాండవ మల్లేశ్వరస్వామి ఆలయంలో పురోహితులు లక్ష్మినరసయ్య శర్మ, గువ్వలకుంట్ల ఈశ్వరస్వామి ఆలయంలో పురోహితులు రామయ్యశర్మలు ఆయా గ్రామాల ప్రజలకు పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. ఎర్రరేగడి, నల్లరేగడి భూముల్లో రైతులు పండించిన నల్లని నువులు, మినుములు, ధాన్యములకు మంచి లాభదాయకంగా ఉంటుందని వివరించారు. అలాగే వ్యాపార రాజకీయ నాయకుల భవిష్యత్తు కూడా ఆశాజనకంగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

మిడుతూరు: మండలంలో క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను మంగళవారం ప్రజలు ఘనంగా నిర్వహించారు. వేదపండితులు సుబ్రమణ్యశర్మ శాస్త్రోత్తంగా వేదమంత్రోచ్చరణల మధ్య పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పంచాంగ పఠనం నిర్వహించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో యువత, పిల్లలు రంగులు చల్లుకుని ఉత్సాహంగా గడిపారు. గ్రామ దేవతల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాన్ని అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంకాలం స్థానిక లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో స్వామి వారి మూలవిరాట్ పాదాలను సూర్యకిరణాలు స్పశించాయి. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రాస్తులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: శ్రీక్రోధి నామ సంవత్సరంలో కొంతమేర అనుకూల పరిస్థితులు ఉన్నాయని పురోహితులు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం తెలుగింటి కొత్త సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లోని వీధిఅరుగులు, ఆలయాల్లో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో పురోహితులు గరుడాద్రి భానుమూర్తి, గరుడాద్రి సత్యనారాయణశర్మ, గరుడాద్రి వెంకటేశ్వరశర్మ పంచాంగాన్ని వినిపించారు. ఉగాది పండుగను పురస్కరించుకుని వివిధ ఆలయాలకు భక్తులు తరలివచ్చి నైవేద్యాలను సమర్పించారు. అంతేకాకుండా నూతన వస్త్రాలు, పిండివంటలతో కుటుంబసమేతంగా ఉగాది ఉత్సవాన్ని సంబరంగా జరుపుకొన్నారు.

ఆత్మకూరు రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది పర్వదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని తమ బంధుమిత్రులకు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ ఆనందంగా గడిపారు. కరివేన, బాపనంతాపురం, శ్రీపతిరావు పేట, సిద్దాపురం, ఇందిరేశ్వరం, కురుకుంద,నల్లకాలువ,సిద్దపల్లి గ్రామాలలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయా ఆలయాలలో ప్రత్యేక పూజాది క్రతువులు నిర్వహించడంతో ఆలయాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా మహిళలు ఆయా గ్రామాలలోని సుంకులమ్మ, జములమ్మ ఆలయాలలో పిండివంటలను నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటాపురం గ్రామంలో రాజరాజేశ్వరి మాత ఆలయంలో ఆ గ్రామ మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఒడి బియ్యాన్ని సమర్పించారు. పంచాంగాన్ని చదివి వినిపించి ఈ సంవత్సరం రాశిఫలాల వారికి ఏవిధంగా ఉంటుందని పండితులు తెలియ జేశారు. శ్రీ క్రోధి నామ సంవత్సరం ప్రజలంతా సుఖసంతోషాలతో జీవిస్తారని పురోహితులు తెలిపారు.


నంద్యాల: టెక్కె సుంకులమ్మ గుడిలో క్యూలైన్‌లో భక్తులు


బండిఆత్మకూరులో..


పెద్దదేవళాపురంలో వరదరాజ స్వామి గ్రామోత్సవం


మిడుతూరులో వసంతోత్సవం


పాణ్యం: ఇందిరానగర్‌లో..

బండిఆత్మకూరు: మండలంలో ఉగాది వేడుకలను ప్రజలు ఆనోందోత్సాహాల నడుమ ఉత్సాహంగా జరుపుకున్నారు. మంగళవారం తెలుగు సంవత్సరాధి క్రోధి నామ సంవత్సరాన్ని స్వాగతిస్తూ మహిళలు ఇళ్ళ ముందు రంగవళ్లులు తీర్చిదిద్దారు. యువత రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. సాయంత్రం వేళ ఆలయ కమిటీలు, గ్రామ పెద్దల సమక్షంలో పంచాంగ శ్రవణం చేయించారు. ఉగాది పచ్చడిని పంచి పెట్టారు. గ్రామాల్లో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీల్లో ఉత్సవమూర్తులను కొటువు దీర్చి గ్రామోత్సవాలు నిర్వహించారు. ప్రజలు కాయ, కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మహానంది: మహానంది ఆలయంలో మంగళవారం ఉగాది పండుగను పురష్కరించుకొని ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని పంచాంగ శ్రవణం చేశారు. ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులు విగ్రహాలను ప్రత్యేక పల్లకీపై ఆశీనులు గావించారు. అనంతరం ఉగాది పురష్కరించుకొని పూజలు జరిపారు. వేదపండితులు ఉగాది పంచాంగం చదివారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగోడు: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని వెలుగోడు పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో ఉగాది పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఆయా గ్రామాలలోని ఆలయాలలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. వెలుగోడు పట్టణంలో చెన్నకేశవ ఆయంనుంచి దేవతా మూర్తులను గ్రామోత్సవం నిర్వహించారు. ఉగాది పచ్చడిని ప్రత్యేకంగా తయారు చేసి ఆయాల్లో భక్తులకు పంచి పెట్టారు. పలు ఆలయాలలో అర్చకులు పంచాంగం చదివి వినిపించారు.

పాణ్యం: మండలంలో మంగళవారం నూతన తెలుగు సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. గ్రామాలలో రంగుల బండ్లు కట్టి వీధుల వెంట వసంతోత్సవం నిర్వహించారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో టివి సుబ్బశాస్త్రి ఆధ్వర్యంలో శ్రవణ పంచాంగం నిర్వహించారు. కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి ఉత్సవ విగ్రహాలను పురవీధుల గుండా ఊరేగించారు. స్థానిక ఇందిరానగర్‌లో చెంచు యువకులు ఆనందోత్సాహాల మధ్య వసంతోత్సవం నిర్వహించుకున్నారు. చెంచులు సుంకులా పరమేశ్వరీదేవికి బోనాలు సమర్పించారు. పాణ్యంలోని సుంకులమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేద పండితుడికి ఉగాది పురస్కారం


ఉగాది పురస్కారం అందుకుంటున్న వేదపండితుడు

మహానంది, ఏప్రిల్ 9: మహానంది దేవస్థానం వేద పండితుడు నౌడూరి వెంకట దుర్గా నాగేశ్వర శర్మకు ఉగాది పండుగ సందర్భంగా పురష్కారం దక్కింది. మంగళవారం విజయవాడలోని కలెక్టరేట్‌లో రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, రాష్ట్ర సాంస్కృతిక శాఖ చీఫ్ సెక్రటరీ చేతుల మీదుగా పురష్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక వేదపండితులు, ఆలయ అధికారులు ఆనందం వ్యక్తం చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఐ

ఆత్మకూరు, ఏప్రిల్ 9: శ్రీకోధినామ ఉగాది నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్ నూతనంగా రూపొందించిన తెలుగు సంవత్సరాది క్యాలెండర్లను మంగళవారం ఆత్మకూరు ఎస్‌ఐ వెంకటనారాయణ రెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. తెలుగు నూతన సంవత్సరంలో ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రకృతిలో అనుబంధమైన ఉగాది పండుగ ప్రజల జీవితాల్లో వెలుగు నింపాలని ఆకాంక్షించారు. అనంతరం విశ్వహిందూ పరిషత్ ఆత్మకూరు ప్రఖండ అధ్యక్షుడు గరుడాద్రి సుదర్శన్ మాట్లాడుతూ.. తెలుగింటి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో తెలుగు మాసాలు, పక్షాలు, తిథిలతో కూడిన శోభకృత్ నామ సంవత్సర క్యాలెండర్లను తయారు చేయించడం సంతోషకరమని అన్నారు. ఈ క్యాలెండర్లను పట్టణంలో పంపిణీ చేసి తెలుగు సంవత్సరాది ప్రాముఖ్యతను ప్రజలకు వివరింపజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు నాయకులు శ్రీధర్‌గుప్తా, ఆవుల రెడ్డి, మారం భానుమూర్తి, వినోద్‌కుమార్, శివరామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఇఫ్తార్‌లో మాజీ ఎమ్మెల్యే బుడ్డా


మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని సత్కరిస్తున్న ముస్లింలు


ఇఫ్తార్‌లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా

ఆత్మకూరు, ఏప్రిల్ 9: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు పట్టణంలోని మక్కా మసీద్‌లో నిర్వహించిన ఇఫ్తార్‌లో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు. ముందుగా ఆయన ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆతర్వాత వారితో కలిసి ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. బుడ్డా మాట్లాడుతూ రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని అల్లాహ్ స్మరణతో ముస్లింలు చేస్తున్న ఉపవాస దీక్షలు ఎంతో గొప్పవని కొనియాడారు. అలాగే సోదరభావంతో కూడిన ఆత్మీయతకు ఇఫ్తార్ విందు ప్రతీక అని చెప్పారు. అల్లాహ్ ఆశీస్సులతో ప్రజలందరు సుఖశాంతులతో ఉండాలని కాంక్షించారు. అంతకుముందు ముస్లిం మైనార్టీ సోదరులు ఆయనకు రుమాల్‌తో సత్కరించారు. మాజీ సర్పంచ్ కంచర్ల గోవిందరెడ్డి, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్ రెడ్డి, వేణుగోపాల్, మైనార్టీ నాయకులు కలీముల్లా, నాగూర్‌ఖాన్, అబ్దుల్లాపురం బాషా, హిదాయత్, నూర్‌బేగ్, మోమిన్ ఇబ్రహీం ఖలీలుల్లా తదితరులు ఉన్నారు.

ఫరూక్‌కు ప్రముఖుల పరామర్శ


ఎన్‌ఎండీ ఫరూక్‌ను పరామర్శిస్తున్న నాయకులు

నంద్యాల(నూనెపల్లి), ఏప్రిల్ 9: టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి, నంద్యాల అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి ఎన్‌ఎండీ ఫరూక్ పాణ్యం మండలం తమ్మరాజుపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో పలువరు పరామర్శించారు. గాయపడిన ఆయనను ప్రత్యేక వాహనంలో చికిత్స నిమిత్తం నంద్యాలలోని ఎస్‌ఐటీసీకి తరలించారు. వైద్యులు ఆయన్ని పరీక్షించారు. ప్రమాదంతో ఫరూక్ శరీరం కుదుపునకు గురైందని, మూడు రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణ అవసరం ఉందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. 12గంటల తర్వాత వైద్యపరీక్షల రిపోర్టులు వచ్చిన తర్వాత తదుపరి చికిత్సను కొనసాగిస్తామని వైద్యులు తెలిపారు. ఫరూక్‌కు ప్రమాదం జరిగి నంద్యాల ఆసుపత్రికి రావడంతో ఆయన్ని పరామర్శించేందుకు రాజకీయ పార్టీలకు అతీతంగా నాయకులు తరలి వచ్చారు. మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బైరెడ్డి రాజశేఖరరెడ్డి, భూమా బ్రహ్మానందరెడ్డి, నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, వైసీపీ సీనియర్ నాయకులు మల్కిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డితో పాటు టీడీపీ, వైసీపీ, బీజేపీ ఇతర పార్టీల నాయకులు పరామర్శించారు.

అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ


కొబ్బరికాయల సమర్పణ కార్యక్రమంలో సిబ్బంది, భక్తులు

శ్రీశైలం, ఏప్రిల్ 9: శ్రీశైల మహాక్షేత్రంలో చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళవారం గానీ, శుక్రవారం గానీ భ్రమరాంబ అమ్మవారికి కుంభోత్సవం జరిపించడం సంప్రదాయం. ఇందులో భాగంగా ఈ సంవత్సరం ఏప్రిల్ 26న కుంభోత్సవం నిర్వహించనున్నారు. అమ్మవారికి సాత్వికబలి నిర్వహించేందుకు కుంభోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో కుంభోత్సవం రోజున స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభ హారతి సమర్పించడం ప్రధాన ఘట్టం. ఈ కుంభోత్సవాన్ని పురస్కరించుకొని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే వచ్చే ప్రతి మంగళవారం, శుక్రవారం రోజులలో అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పిస్తారు. ఇందులో భాగంగా మంగళవారం అమ్మవారి ఆలయ ప్రదక్షిన మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో పూజాధికాలు నిర్వహించి అనంతరం అమ్మవారికి సమర్పించారు.

మహానందిలో భక్తుల రద్దీ


భక్తులతో కిటకిటలాడుతున్న మహానంది క్షేత్రం

మహానంది, ఏప్రిల్ 9: మహానంది ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఉగాది పర్వదినం పురష్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రధాన ఆలయాల్లో పూజలు నిర్వహించిన అనంతరం ఆనవాయితీలో భాగంగా కన్నడ పట్టుడు కర్రలు కొనుగోలు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా నిరంతర దర్శనానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

భక్తిశ్రద్ధలతో హోమం


మిడుతూరులో హోమం నిర్వహిస్తున్న పండితులు

మిడుతూరు, ఏప్రిల్ 9: మండల కేంద్రం మిడుతూరులో లక్ష్మీచెన్నకేశవ ఆలయంలో మంగళవారం ధ్వజస్తంభ, కలశ శిఖర ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా (41 రోజుల పండగ) పురస్కరించుకుని నవగ్రహ హోమం, శిఖర ప్రతిష్ఠ హోమ కార్యక్రమం తదితర విశేష పూజలను వేద పండితులు సుబ్రమణ్యం శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు వెంకటరామయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

బండిఆత్మకూరు, ఏప్రిల్ 9: మండలంలో ప్రతి రోజూ ఏదో ఒక గ్రామం నుంచి టీడీపీలోకి వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. మంగళవారం టీడీపీ సీనియర్ నాయకుడు రామలింగారెడ్డి, సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈర్నపాడుకు చెందిన రజకులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వెంగళరెడ్డి పేట గ్రామంలో వి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో 30 కుటుంబాలు, పరమటూరు గ్రామంలో సాయిబాబారెడ్డి ఆధ్వర్యంలో బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో పలు కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. కార్యక్రమాల్లో నాయకులు శంకర్‌రెడ్డి, ఎస్ ప్రతాపరెడ్డి, రామకృష్ణారెడ్డి, శీను, భూపాల్‌రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచిన వైసీపీ

మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ



వలసలలో ప్రచారం నిర్వహిస్తున్న కోట్ల సుజాతమ్మ

డోన్, ఏప్రిల్ 9: వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచిందే తప్ప.. ప్రజలకు చేసిందేమీ లేదని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని వలసల గ్రామంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో పథకాలను ఇంటింటికి తిరిగి వివరించారు. ఈ సందర్భంగా కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ సీఎం జగన్, ఆర్థిక మంత్రి బుగ్గన ఇద్దరు కలిసి రూ. లక్షల కోట్లు అప్పులు తెచ్చి రాష్ట్ర ప్రజల నెత్తిన భారం మోపారని మండిపడ్డారు. సంపద సృష్టించడం చేతగాక అభివృద్ధిని మరో 30 ఏళ్లు వెనక్కి నెట్టి ప్రజలకు భవిష్యత్తు లేకుండా చేసిన ఘనత సీఎం జగన్, మంత్రి బుగ్గనకే దక్కిందన్నారు. బటన్ నొక్కడం తప్ప.. జగన్ ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదన్నారు. ప్రజల విశ్వాసం కోల్పోయిన వైసీపీని ఓడించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, భాస్కర్ నాయుడు, దేవరబండ వెంకటనారాయణ, రంజిత్ కిరణ్, వలసల బాలుడు, సుధాకర్, గోసానిపల్లి శ్రీరాములు, వెంకటాపురం పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం



చాగలమర్రిలో పట్టుబడ్డ మద్యం లారీ

చాగలమర్రి, ఏప్రిల్ 9: చాగలమర్రి గ్రామంలోని టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా 11 తెలంగాణ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రమణయ్య మంగళవారం తెలిపారు. చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా తెలంగాణకు చెందిన లారీ కడప జిల్లా బద్వేల్‌కు వెళ్తుండగా లారీ క్యాబిన్‌లో మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయని చెప్పారు. మధుసూదన్‌రెడ్డి అనే వ్యక్తి బాటిళ్లను తీసుకెళ్తుండటంతో పట్టుకున్నామన్నారు. మద్యం సీసాలు తరలించే లారీని కూడా సీజ్ చేశామని తెలిపారు. అలాగే మండలంలోని పెద్దవంగలి గ్రామానికి చెందిన బాషా అనే వ్యక్తి 19 మద్యం సీసాలు కొనుగోలు చేసి అక్రమంగా అమ్మేందుకు సిద్ధంగా ఉంచిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రుద్రవరం: మండలంలోని పెద్దకంబలూరు గ్రామంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన మద్యం బాటళ్లు అక్రమంగా నిల్వ ఉన్నట్లు సమాచారం రావడంతో సోమవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన 9 మద్యం ఫుల్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మీదేవి అనే మహిళపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ బాలన్న మంగళవారం తెలిపారు.

కంబగిరిస్వామి తిరుణాల



తేరుబండ్లతో ప్రదక్షిణలు చేస్తున్న గ్రామస్థులు

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 9: మండలంలోని సుద్దమల్ల గ్రామంలో మంగళవారం కంబగిరిస్వామి తిరుణాల నిర్వహించారు. ఉగాది పండుగను పురస్కరించుకొని ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా అల్లూరు, ఉయ్యాలవాడ గ్రామస్థులు 30 జతల ఎడ్ల సాయంతో మూడు తేరు బండ్లతో వచ్చి స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కుందూనదిలో నుంచి తేరుబండ్లను లాక్కురావటం అందరిని ఆకట్టుకుంది. మాయలూరు, రూపనగుడి, ఇంజేడు, పడిగెపాడు, నర్సిపల్లె, హరివరం, బోడెమ్మనూరు, పెద్దయమ్మనూరు తదితర గ్రామల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వాహనాలతో వచ్చి దేవాలం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అర్చకుడు కలమలేశ్వరశర్మ స్వామివారికి అభిషేకం చేసి అలంకరించారు. భక్తులకు హారతి ఇచ్చి తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

ఓటర్లకు డబ్బులు పంచిన వైసీపీ నాయకుడు



డబ్ల్యు.కొత్తపల్లెలో డబ్బులు పంచిన భూమా కిశోర్‌రెడ్డి

నంద్యాల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): దొర్నిపాడు మండలం డబ్ల్యు.కొత్తపల్లెలో వైసీపీ నాయకుడు భూమా కిశోర్‌రెడ్డి ఎస్సీ కాలనీ వాసులకు రూ. 1.50 లక్షలు పంపిణీ చేశారు. ఆయన సోమవారం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థికి ఓట్లు వేయాలంటూ డబ్బులు ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కూడా ఓటర్లను తన వైపు తిప్పుకునేందుకు డబ్బులతో ప్రలోభపెట్టారు. దీనిపై టీడీపీ నాయకులు మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ స్వగ్రామం కావడంతో ఆమెకు మెజార్టీ రాకుండా చేయడానికే వైసీపీ నాయకులు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి ఓటర్లను డబ్బులు పంచారని ఆరోపించారు.

రస్తా విషయంలో ఘర్షణ

భార్యాభర్తలపై కేసు నమోదు

బేతంచెర్ల, ఏప్రిల్ 9: మండలంలోని సీతారామాపురం గ్రామానికి చెందిన హరిక్రిష్ణ, లావణ్య అనే దంపతులపై దాడి చేసి కొట్టి గాయపరిచారని ఐదుగురిపై కేసు నమోదైనట్లు హెడ్‌కానిస్టేబుల్ ఎంవీ రమణ తెలిపారు. ఇంటి స్థలం రస్తా విషయంలో గ్రామానికి చెందిన గుర్రప్ప, శివ, లక్ష్మీనారాయణ, శ్రీను, తిక్కన్న తమను కొట్టి గాయపరిచారని హరిక్రిష్ణ, లావణ్య ఫిర్యాదు చేశారని ఆయన తెలిపారు. ఈమేరకు వారిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే హరిక్రిష్ణ, లావణ్య తనపై దాడి చేసి గాయపరిచారని గ్రామానికి చెందిన తెలుగు రామసుబ్బమ్మ అనే మహిళ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివశంకర్ నాయక్ తెలిపారు.

వైభవంగా ఉగాది

నంద్యాల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అహోబిలం లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో మంగళవారం క్రోధి నామ ఉగాది వేడుకలను వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఎగువ, దిగువ అహోబిలాల్లోని మూలవిరాట్‌కు ఉదయాన్నే నవకలశ తిరుమంజనం చేశారు. దిగువ అహోబిలంలో ప్రహ్లాద వరదస్వామి సన్నిధిలో పంచాంగ పుస్తకాలను ఉంచి మహామంగళ హారతి అనంతరం పంచాంగం వినిపించారు. ఆలయంలో పీఠాధిపతి రంగనాథ యతీంద్ర పూజలు చేశారు.

● పీఠాధిపతి రంగనాథయతీంద్ర మహాదేశికన్ మంగళవారం హైదరాబాదుకు తన శిష్య బృందంతో విజయాత్రకు బయలుదేరి వెళ్లారు.

● ఆళ్లగడ్డ ప్రాంతంలోని గ్రామాల్లోని ప్రజలు ఉగాది వేడుకలను ఆనందోత్సాహాల మధ్య మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పి.చింతకుంట గ్రామంలో వేంకటేశ్వరస్వామిని ఎడ్ల బండిపై మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహిస్తూ రంగులు చల్లుకుంటూ ఆనందంగా జరుపుకొన్నారు. అలాగే ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తులు పూజలు చేశారు. భక్తులకు పానకం, పందేరం పంపిణీ చేశారు.

● ఆళ్లగడ్డ పట్టణంలోని అమ్మవారిశాలలో ఉగాది వేడుకల్లో పంచాంగం చదివి భక్తులకు వినించారు. ఈ వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులతో పాటు ప్రముఖులు రామసుబ్రమణ్యం, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డోన్(రూరల్): డోన్ పట్టణంతోపాటు మండలంలోని గ్రామా ల్లో ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బేతంచెర్ల రోడ్డులోని చాకిరేవుమెట్ట దిగువ ప్రాంతంలో చిన్న సుంకులమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. అలాగే మండలంలోని చిన్న మల్కాపురం గ్రామంలోని పీర్లచావిడిలో పురోహితుడు బాలసుబ్బయ్య, రైతులకు పంచాంగం వినిపించారు. అలాగే మండలంలోని వెంకటాపురం, గోసానిపల్లె, చిన్నమల్కాపురం గ్రామాల్లోని సుంకులమ్మ, మారెమ్మ అమ్మవార్ల ఆలయాల్లో ప్రజలు, మహిళలు పూజలు చేశారు.

బేతంచెర్ల: పట్టణంలోని గౌరిపేటలో వెలసిన సుంకులా పరమేశ్వరి దేవిని దర్శించుకునేందుకు ప్రజలు బారులు తీరారు. భక్తులు ఎండలను లెక్క చేయకుండా బారులుతీరి అమ్మవారిని దర్శించుకున్నారు.

మద్దిలేటి స్వామి క్షేత్రంలో పంచాంగ శ్రవణం: ఉగాది పండుగను పురస్కరించుకుని మద్దిలేటి స్వామి క్షేత్రంలో దేవదాయ శాఖ ఉప కమిషనర్, ఆలయ కార్యనిర్వహణ అధికారి రామాంజనేయులు, ఆలయ చైర్మన్ సీతారా మచంద్రుడు ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో గ్రూపు దేవాలయాల ఈవో మద్దిలేటి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం వేద పండితులు పఠించారు. అనంతరం మద్దిలేటి స్వామి క్షేత్రంలో ఆలయ ఈవో రామాంజనేయులు, చైర్మన్ సీతారామచంద్రుడు, వేదపండితులు, అర్చకులకు నూతన దుస్తులు అందజేసి సన్మానించారు.

బనగానపల్లె: బనగానపల్లె మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది పర్వదిన వేడుకలు మంగళవారం జరిగాయి. పట్టణంలోని కొండపేటలోని సుంకులమ్మగుడిలో అమ్మవారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించు కున్నారు. అవుకు రహదారిలోని బాట సుంకులమ్మను కూడా ప్రజలు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. తెలుగుపేటలోని బంగారమ్మ గుడిలో, యాగంటిపల్లె రహదారిలోని సుంకులమ్మ గుడిలో భక్తులు కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. పలు ఆలయాల్లో పంచాంగ పఠనం చేశారు.

యాగంటిలో పంచాంగ శ్రవణం: బనగానపల్లె మండలంలోని యాగంటి క్షేత్రంలో మంగళవారం ఉమామహేశ్వరస్వామి సన్నిధిలో పంచాంగ శ్రవణం చేశారు. ఆలయ చైర్మన్ బుచ్చిరెడ్డి, ఈవో చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకు లతోపాటు వేదపండితుడు కిశోరయ్య ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం పఠించారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురుస్తాయని, పంటలు బాగా పండు తాయని చెప్పారు.

శిరివెళ్ల: మండలంలోని గ్రామాల్లో ఉగాది పర్వదిన వేడుకలను ప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. గ్రామాల్లో ప్రజలు రంగులు చల్లుకుంటూ ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. శిరివెళ్ల, యర్రగుంట్ల, కోటపాడు, గోవిందపల్లె తదితర గ్రామాల్లో కొలువైన మారెమ్మ, గ్రామ దేవతలకు మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

రుద్రవరం: మండలంలోని వాసాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం క్రోధి నామ సంవత్సరం ఉగాది పండుగ పంచాంగ పఠనాన్ని అర్చకుడు గోపిశర్మ చదివారు. ఆలమూరు, నరసాపురం, రుద్రవరం, శ్రీరంగాపురం, యల్లావత్తుల ఇంకా పలు గ్రామాల్లో ఉగాది పురస్కరించుకుని చిన్నారుల నుంచి పెద్దల వరకు రంగులు చల్లుకుని సందడి చేశారు. అనంతరం దేవాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉగాది సందర్భంగా ఘనంగా ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని తయారు చేసి పిల్లలకు అందించారు. పండితులు పంచాంగం గురించి తెలియజేశారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలో తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పండుగ సందర్భంగా గ్రామాల్లో రైతులు ఏరువాక పండుగను ఘనంగా నిర్వహించారు. చాగలమర్రి గ్రామంలో టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, ఆధ్వర్యంలో ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభించారు. వృషభాలను అలంకరింప చేసి పొలంలో ఏరువాక పనులను చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మౌలాలి, అనీఫ్, మాబు షరీఫ్, రైతులు పాల్గొన్నారు.


● చాగలమర్రి గ్రామంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉగాది పండుగ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు ఆధ్వర్యంలో వాసవీ మాతకు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుడు నరసింహశాస్త్రి పంచాంగం చదివారు. ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబును ఆర్యవైశ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అవుకు: అవుకు మండలంలోని ప్రజలు ఉగాది వేడుకలు మంగళవారం సాంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. అవుకు పట్టణంలోని మూలమ్మ, పెద్దమ్మ, ఎల్లమ్మ, సుంకులమ్మ, మారెమ్మ, జమ్ములమ్మ ఆలయాలలల్లో భక్తులు అధిక సంఖ్య పూజలు చేశారు. లక్ష్మీచెన్నకేశవస్వామిని పల్లకీలో ఊరేగించారు. మార్కెట్ వీధిలోని సీతారాముల వారి ఆలయంలో అర్చకులు పంచాంగం చదివి వినిపించారు.

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్ల మండలంలో క్రోధి నామ ఉగాది పండుగ వేడుకలు ప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. కొలిమిగుండ్లలో దేవరిల్లు పెద్దమ్మ, కుంటెమ్మ దేవతలకు పూజలు నిర్వహించారు. దేవరిల్లు పెద్దమ్మ గుడి దగ్గర అన్నదానం చేశారు.

కొలిమిగుండ్ల రూరల్: కొలిమిగుండ్ల మండలంలోని వివిధ గ్రామాల్లో క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగ వేడుకలు ప్రజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు నూతన వస్త్రాలు ధరించి ఆలయాల్లో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. కొలిమిగుండ్ల కుంటెమ్మ ఆలయం, మీర్జాపురం సుంక లమ్మ ఆలయం, కనకాద్రిపల్లె, అంకిరెడ్డిపల్లె, కల్వటాల, బెలుం తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు, సొంత వాహనాలను ఆలయాల చుట్టూ ప్రదక్షిణ గావించారు. ప్రధాన ఆలయాల్లో వేద పండితుడు పంచాంగ పఠనం చేశారు.

సంజామల: మండలలోని గ్రామాల్లో ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ప్రజలు ఆలయాలకు వెళ్ళి అభి షేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంజామలలో వనం వేంకటేశ్వర్లు, పేరుసోములలో చెన్నకేశవ స్వాముల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.





యాగంటిలో పంచాంగ శ్రవణం చేస్తున్న వేద పండితులు, రుద్రవరం మండలం: వాసాపురంలో..



అహోబిలంలో పూజలు చేస్తున్న పీఠాధిపతి



వెంకటాపురం మారెమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



బనగానపల్లెలో..



శిరివెళ్లలో..



చాగలమర్రిలో..



బేతంచెర్లలో..



కొలిమిగుండ్లలో..

తెలుగు క్యాలెండర్ విడుదల



తెలుగు క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

బేతంచెర్ల, ఏప్రిల్ 9: తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో తెలుగు క్యాలెండర్లను ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విడుదల చేశారు. ఈసందర్భంగా చంద్రమౌళీ శ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రజలు పాశ్చాత్య నాగరికతను వీడనాడి హిందూ సాంప్రదాయాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు గౌరి హుశేన్ రెడ్డి, మారుతి కృష్ణ శర్మ, గుండా గోపాల్, పుల్లారెడ్డి, నాగమో హన్, బుగ్గన విశ్వనాథరెడ్డి, గోపాల్ రెడ్డి, బుగ్గన మాధవిరెడ్డి పాల్గొన్నారు.

'టీడీపీతోనే పేదల సంక్షేమం'

చాగలమర్రి, ఏప్రిల్ 9: టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని ఆళ్లగడ్డ టీడీపీ నాయుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని కేపీ తండా గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం చింతలచెరువు గ్రామంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన టీడీపీ నాయకుడు నారాయణరెడ్డిని పరామర్శించారు. టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, నాయకులు రామనరసింహారెడ్డి, హరిశ్చంద్రారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పరిశీలన

చాగలమర్రి, ఏప్రిల్ 9: చాగలమర్రి గ్రామంలో ఎన్నికల సహాయ అధికారులు, వీఎస్‌పీ టీమ్ అధికారులు మంగళవారం ఎన్నికల ప్రవర్తన నియమావళిపై పరిశీలన చేశారు. ఎంపీసీ సహాయ అధికారులు బాల దస్తగిరి, నరసింహులు, వీఎస్‌పీ టీమ్ లీడర్ శ్రీదేవి ఆధ్వర్యంలో ఎన్నికల నియమావళిని పరిశీలించారు. ఎన్నికల నియమావళిపై గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచామని అన్నారు.

'రెచ్చగొట్టే మెసేజ్‌లు పంపితే కఠిన చర్యలు'

నంద్యాల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్లలో రెచ్చగొట్టే మెసేజ్‌లు చేస్తే చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ రమేష్‌బాబు హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల్లో కుల, మతాలు, అభ్యర్థులపై వ్యక్తిగత విమర్శలతో కూడిన మెసేజ్‌లు చేస్తే అడ్మిన్‌లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కృష్ణానగర్‌లో షార్ట్ సర్క్యూట్

కల్లూరు, ఏప్రిల్ 9: 27వ వార్డు కృష్ణానగర్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో రవీంద్రస్కూల్ సమీపంలోని కిరాణ షాప్, ఇంట్లో విలువైన వస్తువులు కాలిపోయాయి. మంగళవారం నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదం వివరాలను అడిగి తెలుసు కున్నారు. అనంతరం బాధితులను ఆయన పరామర్శించారు. ఆయన వెంట ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, కేతురు మధు ఉన్నారు.

మేనిఫెస్టోలో 'దళితబంధు'ను చేర్చాలి



మాట్లాడుతున్న అందనం దేవరాజు

కోవెలకుంట్ల, ఏప్రిల్ 9: ఆంధ్రప్రదేశ్‌లో దళితుల కోసం దళిత బంధు పథకాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రవేశపెట్టాలని నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అందనం దేవరాజు డిమాండ్ చేశారు. మంగళ వారం కోవెలకుంట్ల మండల పరిధిలోని వెలగటూరు గ్రామంలో దళి తుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం మాది రిగా ఆంధ్రప్రదేశ్‌లో దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, రత్నమయ్య, ప్రసాద్, జగదీశ్, పుల్లన్న, ఆదామ్ పాల్గొన్నారు.

'ధర్మ ప్రచారం అందరి బాధ్యత'



మాట్లాడుతున్న అభినవ శంకరానందస్వామి

చాగలమర్రి, ఏప్రిల్ 9: ధర్మ ప్రచారం అందరి బాధ్యతని శివరామానంద ఆశ్రమం నిర్వాహకులు అభినవ శంకరానందస్వామి అన్నారు. మంగళవారం ఆశ్రమంలో పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి హిందువు ధర్మాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఆధ్యాత్మిక చింతన కలిసి దైవమార్గంలో నడవాలని అన్నారు. కొత్త సంవత్సరంలో జరిగే పంచాంగ శ్రవణం ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్ ఎఫ్ సభ్యులు, హిందూ సంఘం నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

డోన్, ఏప్రిల్ 9: మండలంలోని వలసల గ్రామానికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు మంగళవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సమక్షంలో టీడీపీలో చేరారు. గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కోట్ల సుజాతమ్మ గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు బండారు రాముడు, రంగస్వామి, రాజశేఖర్, రమేష్, లక్ష్మీసుధ, మధు శేఖర్, వెంకటేశ్వర్లు, నరసింహులుతోపాటు మరో 20 కుటుంబాల కార్యకర్తలకు టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, మాజీ జడ్పీటీసీ పద్మావతమ్మ, వలసల బాలుడు, గోసానిపల్లి మల్లయ్య, భూమా నాగన్న పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని పెద్దకంబలూరు గ్రామంలో మంగళవారం టీడీపీ నాయకుడు భార్గవరామ్‌నాయుడు ఆధ్వర్యంలో వార్డు సభ్యురాలు పుల్లమ్మ, గురప్ప, చిన్నప్రసాద్, ఆంజనేయులుతో పాటు మరో 25 కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎర్రం ప్రతాప్‌రెడ్డి, గంగావెంకటేశ్వర్‌రెడ్డి, బీసీ సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలో పడిన యువకుడు

మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా ఘటన



డ్రైనేజీలో పడి లేస్తున్న యువకుడు

రుద్రవరం, ఏప్రిల్ 9: రుద్రవరం గ్రామంలో ఫారెస్టుబంగ్లా వెళ్లే రహదారిలో మోటారు సైకిల్ అదుపుతప్పి ఓ యువకుడు డ్రైనేజీలో పడిపోయాడు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. ఈ డ్రైనేజీని అసంపూర్తిగా వదిలేశారని, దీంతో ప్రమాదకరంగా మారిందని వాహనదారులు, స్థానికులు అంటున్నారు. ఇంతకు ముందు ఇలాంటి ఘటనలు జరిగాయని, వెంటనే గుంతను పూడ్చివేయాలని కోరారు.

అరాచక పాలనకు అంతం తప్పదు: అఖిలప్రియ

చాగలమర్రి, ఏప్రిల్ 9: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు అంతం తప్పదని మాజీ మంత్రి, ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. మంగళవారం చాగలమర్రి గ్రామంలోని 15, 16 వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్-6 పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని రంగాల వారు విసిగి పోయారన్నారు. విద్యుత్ బిల్లులు, నిత్యావసర సరుకులు, పెట్రోల్ తదితర ధరలను విపరీతంగా పెంచి ప్రభుత్వం రాష్ట్ర ప్రజల నడ్డి విరిచిందన్నారు. నిరుద్యోగులు, మహిళలు, రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారన్నారు. ఎన్నికల్లో వైసీపీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అన్సర్‌బాషా, ఉసేన్‌వలి, షరీఫ్, వేణుగోపాల్‌రెడ్డి, రామసుబ్బయ్య, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

మూల పెద్దమ్మకు అఖిలప్రియ పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూల పెద్దమ్మ అమ్మవారికి మంగళవారం ఉగాది పండుగ పురష్కరించుకొని మాజీ మంత్రి, ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భూమా అఖిలప్రియకు ఆలయ అర్చకుడు అమ్మవారి ఆశీస్సులు అందించారు. పండుగ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భూమా జగత్ విఖ్యాతరెడ్డి, ఏరువ ప్రసాద్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, బాబు తదితరులు ఉన్నారు.



చాగలమర్రిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న భూమా అఖిలప్రియ





ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

అభివృద్ధే లక్ష్యం

- హంద్రీనీవా కాల్వ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు
- ఓర్వకల్లు కేంద్రంగా పారిశ్రామిక ప్రగతి
- టీడీపీ-జనసేన-బీజేపీ సమన్వయంతో విజయం తథ్యం
- వైసీపీ నేతల భూ కబ్జాలు, అక్రమాలపై విచారణ.. బాధితులకు అండగా ఉంటాం
- కర్నూలు కార్పోరేషన్ 16 వార్డుల్లో రోజూ తాగునీరు



కర్నూలు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):

పాణ్యం నియోజకవర్గం అభివృద్ధే మా లక్ష్యం అంటున్నారు పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత. అభివృద్ధి అజెండా మీద ఎక్కడ సమస్యలు ఉన్నా.. ఏ కుటుంబానికి అన్యాయం జరిగినా గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి దంపతులు అక్కడ వాలిపోతారు. అధికారం మాటున వైసీపీ నాయకులు సాగిస్తున్న భూ కబ్జాలు, అవినీతి అక్రమాలు, దౌర్జన్యాలపై పోరాటం సాగిస్తూనే.. బాధిత కుటుంబాలకు మేమున్నామనే భరోసా ఇస్తూ ఎన్నికల్లో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ప్రజలు చరితమ్మ అంటూ ఆప్యాయంగా పిలుచుకునే మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత పాణ్యం నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలో దిగారు. ప్రచారంలో జోరు.. జోష్ పెంచారు. 2014లో ఎమ్మెల్యేగా గెలిచి ఐదేళ్లు ప్రజా సేవలో మమేకమైన తనకు ఈ ప్రాంతం సమస్యలు.. ప్రజల కష్టాలు బాగా తెలుసని అంటున్నారు. టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు నాయకత్వంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం జూన్ 4 తరువాత కొలుదీరనుందని అంటున్నారు. ఓర్వకల్లు కేంద్రంగా పారిశ్రామలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పిస్తామని, హంద్రీనీవా కాల్వ నుంచి కల్లూరు మండలంలో చెరువులు నింపుతామని, ప్రత్యేకంగా ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి ఓర్వకల్లు మండలంలో సాగు, తాగునీరు అందిస్తామని గౌరు చరిత అంటున్నారు. అలగనూరు, గోరకల్లు రిజర్వాయర్ల మరమ్మతలు పూర్తి చేస్తామని, పాణ్యం నియోజకవర్గం పరిధిలోకి వచ్చే కర్నూలు నగరపాలక సంస్థలోని 16 వార్డులకు రోజూ తాగునీరు అందించేందుకు కొత్తగా ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణానికి కృషి చేస్తామంటున్నారు. మీ ఇంటి అడపడుచులా ఆదరించి తనను ఎమ్మెల్యేగా గెలిపించమని, అభివృద్ధిలో పాణ్యం రోల్ మెడల్‌గా తీర్చిదిద్దే బాధ్యత తాను తీసుకుంటానని గౌరు చరిత పేర్కొన్నారు. ఆమెతో ఆంధ్రజ్యోతి చేసిన ఇంటర్వ్యూ ముఖ్యాంశాల్లోకి వెళితే...

● ఆంధ్రజ్యోతి ప్రతినిధి: పాణ్యం టీడీపీ అభ్యర్థిగా అధినేత చంద్రబాబు తొలి జాబితాలో మిమ్మల్ని ఎంపిక చేశారు.. ఎలా ఫీల్ అవుతున్నారు?

● **టీడీపీ అభ్యర్థి గౌరు చరిత** : చాలా సంతోషంగా ఉంది. 2019 నుంచి ప్రజల మధ్యనే ఉన్నాం. అధిష్ఠానం ఏ కార్యక్రమం చేపట్టినా విజయవంతం చేశాం. వైసీపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగట్టాం. పాణ్యంలో గౌరు చరితమ్మ గెలుస్తుందని అన్ని రకాల సర్వేలు చెబుతున్నాయి.

● నోటిఫికేషన్‌కు మిగిలిన గడువు వారమే.. ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నట్లు ఉన్నారు.. ఎలా సాగుతున్నాయి..?

● **గౌరు**: ప్రచారం జోరుగా సాగుతోంది. ఎక్కడికి వెళ్లినా అనూహ్య స్పందన వస్తోంది. మా నియోజకవర్గంలో 3.25 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ముఖ్యంగా కర్నూలు కార్పొరేషన్ పరిధిలో 16 వార్డులపై ప్రత్యేక దృష్టిని పెట్టాం. ఇప్పటికే ఓ దఫా ఇంటింటి ప్రచారం పూర్తి చేశాం. రెండో విడత ప్రచారానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.

● మీ నియోజకవర్గంలో దొంగ ఓట్లు ఎక్కువగా ఉన్నాయి.. వాటిని అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు..?

● **గౌరు**: వైసీపీ నాయకులు అధికారం అడ్డం పెట్టుకుని విచ్చలవిడిగా దొంగ ఓట్లు చేర్పించారు. 8 వేల ఓట్లు గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేసి తొలగించాం. వైసీపీ అభ్యర్థి కాటసాని ఇంటి దగ్గరలో జడ్పీ ఉన్నత పాఠశాలలో 11 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లి 5 కేంద్రాలు ప్రజలకు దగ్గరకు మార్చాం. ఒకే ఇంట్లో భార్యా భర్తల ఓట్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఉన్నాయి. వీటి వల్ల కొంత ఇబ్బందిగా ఉన్నమాట నిజమే.

● వైసీపీ వలంటీర్లను ఉపయోగించుకొని అధికారంలోకి రావాలని చూస్తోంది. వారిని ఎలా కట్టడి చేస్తారు?

● **గౌరు** : వలంటీర్లను ఎన్నికల విధులకు వినియోగించరాదని ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. కొందరు వలంటీర్లు వైసీపీ సేవలో తరిస్తున్నారు. వారిని ధీటుగా ఎదుర్కొనేందుకు మాకు పక్కా ప్రణాళిక ఉంది. 50 ఇళ్లకు ఒకరు కేఎస్‌ఎస్‌లను నియమించాం. వైసీపీ రాజకీయాలకు బలి కావద్దని వలంటీర్లను కోరుతున్నాను.

● ప్రచారంలో ప్రజల నుంచి స్పందన ఎలా ఉంది..?



● **గౌరు** : కర్నూలు నగరంలో ఏ వార్డుకు వెళ్లినా.. కల్లూరు, ఓర్వకల్లు, పాణ్యం, గడివేముల మండలాల్లో ఏ పల్లెకు వెళ్లినా ప్రజల నుంచి అనూహ్య స్పందన ఉంది. అమ్మా..! ఎండల్లో మీరెందుకు వస్తారు.. ఈ జగన్‌ను.. ఎమ్మెల్యే కాటసానిని ఓడించే బాధ్యత మేము తీసుకుంటాం.. అంటూ ప్రజలు అంటున్నారు. వైసీపీ అరాచకాలు పోవాలి.. రాష్ట్రం బాగుపడాలి అంటే చంద్రబాబు రావాలని ప్రజలు అంటున్నారు. మళ్లీ జగన్‌కు అధికారం ఇస్తే దోపిడీ చేయమని ఇంటి తాళం వారి చేతిలో పెట్టినట్లే.. ఆ తప్పు మేము చేయం.. మీరు నిశ్చింతగా ఉండండి... మిమ్మల్ని గెలిపించుకునే బాధ్యత మాది అంటూ జనమే మాకు గెలుపు భరోసా ఇస్తున్నారు. ఇంతటి స్పందన మునుపెన్నడూ చూడలేదు.

● నగరం.. పల్లెటూళ్లు చుట్టేస్తున్నారు.. ప్రజలు ఎలాంటి సమస్యలు మీ దృష్టికి తీసుకొస్తున్నారు?

● **గౌరు** : ముఖ్యంగా కర్నూలు నగరం పరిధిలోని 16 వార్డులకు రెండు రోజులకు ఒకసారి తాగునీరు వస్తోంది. పల్లెల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. మురుగు కాల్వలు, రోడ్లు, పేదలకు పక్కా ఇళ్లు, గ్రామాల్లో కరువు, సాగునీరు, ఉద్యోగాలు రాక ఆందోళన చెందుతున్న నిరుద్యోగ యువత.. ఇలాంటి ఎన్నో సమస్యలు మా దృష్టికి వచ్చాయి.

● వాటి పరిష్కారానికి మీ వద్ద ఉన్న ప్రణాళిక ఏంటి ..?

● **గౌరు** : చంద్రబాబును సీఎం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. రాబోయేది ఎన్డీఏ ప్రభుత్వమే. పాణ్యం నియోజకవర్గంలో వచ్చే కర్నూలు నగరపాలక సంస్థలోని 16 వార్డుల్లో ప్రజలకు రోజూ తాగునీరు ఇచ్చేందుకు మరో ఎస్ఎస్ ట్యాంకు నిర్మించే దిశగా ప్లాన్ చేస్తున్నాం. గోరుకల్లు నుంచి కూడా పైపులైన్ వేసి తాగునీరు అందించేందుకు అవకాశాలపై నిపుణుల కమిటీతో సర్వే చేయిస్తాం. డ్రైనేజీలు, రోడ్లు నిర్మించి మెరుగైన పారిశుధ్యం కోసం చర్యలు తీసుకుంటాం. మా ప్రభుత్వం ఏర్పాటైన నెల రోజుల్లోనే టిడ్కో ఇళ్లు పంపిణీ చేస్తాం. పార్కుల అభివృద్ధి చేస్తాం. కబ్జాల కోరల నుంచి రక్షిస్తాం.



అమ్మ గెలుపు కోసం ప్రచారం నిర్వహిస్తున్న గౌరు జనార్దన్ రెడ్డి



గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డితో నారా లోకేశ్ (ఫైల్)

● మీ ప్రత్యర్థి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అనుచరులపై వస్తున్న అవినీతి ఆరోపణలపై మీ కామెంట్..?

● **గౌరు** : పాణ్యం నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పకడ్బందీగా ఆయన అనుచరుల ద్వారా జగన్నాథగట్టు సహా పాణ్యం, ఓర్వకల్లు మండలాల్లో ఎర్రమట్టి, నల్లమట్టి, చెరువుల్లో మట్టి కొల్లగొట్టారు. భూకబ్జాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. మసీదు (వక్ఫ్) ఆస్తులు కూడా వదలట్లేదు. వారి దౌర్జన్యాలతో ప్రజలు విసిగిపోయారు. ప్రతిపక్ష పార్టీ నాయకురాలిగా ఇప్పటికే కలెక్టరుకు పలుమార్లు ఫిర్యాదు చేశాను. నేను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఎమ్మెల్యే కాటసాని అనుచరులైన వైసీపీ నాయకులు అధికారం మాటున సాగించిన భూకబ్జాలపై ప్రత్యేక విచారణ చేయించి చర్యలు తీసుకుంటాం. ఎవరిని ఉపేక్షించే ప్రసక్తే లేదు.

● వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యం.. మీరు ఎమ్మెల్యేగా గెలిచాక చేపట్టబోయే అభివృద్ధి విషయంలో ఎలాంటి హామీలు ఇస్తారు..?

● **గౌరు**: పాణ్యం నియోజకవర్గంలోకి వచ్చే కర్నూలు కార్పొరేషన్ పరిధిలో 16 వార్డులకు రోజూ తాగునీరు ఇచ్చేందుకు మరో ఎస్ఎస్ ట్యాంకు నిర్మించేందుకు కృషి చేస్తా.

☛ గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు పేదలకు పంపిణీ చేస్తాం.

☛ నగరంలో పార్కులు సంరక్షణ, అభివృద్ధి, మెరుగైన పారిశుధ్యం నిర్వహణ పనులు చేపడతాం.

☛ గడివేముల మండలంలో జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసిన అలగనూరు రిజర్వాయరుకు మరమ్మతులు చేసి కేసీ ఆయకట్టుకు సాగునీరు ఇస్తాం.

☛ గోరుకల్లు జలాశయం మరమ్మతులు రూ.90 కోట్లతో చేపడుతాం.

☛ అసంపూర్తిగా వదిలేసిన ఉర్దూ యూనివర్సిటీ భవనాలను పూర్తి చేస్తాం.

☛ ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ కేంద్రంగా కొత్తగా పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పిస్తాం. ఇక్కడి పరిశ్రమల్లో 70 శాతం స్థానికులకే ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం.

☛ సోలార్, విండ్‌పవర్, పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ప్లాంట్ వల్ల నష్టపోయిన పిన్నాపురం సహా వివిధ గ్రామాల రైతులకు న్యాయం చేస్తాం.

☛ గడివేముల గ్రామానికి బైపాస్ రోడ్డు నిర్మిస్తాం.

☛ వెలగమాను డ్యాం నిర్మాణం సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయించి.. నిపుణుల నివేదిక ప్రకారం ముందుకు వెళ్తాం.

☛ కర్నూలు కార్పొరేషన్ వార్డులు సహా కల్లూరు, ఓర్వకల్లు, గడివేముల, పాణ్యం మండలాల్లో అర్హత కలిగిన పేదలందరికీ 2 సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి పక్కా ఇళ్లు నిర్మిస్తాం.

☛ హంద్రీ నీవా కాల్వ నుంచి కల్లూరు మండలంలో చెరువులు నింపే పనులకు శ్రీకారం చుడుతాం. ఎత్తిపోతల పథకం ద్వారా ఓర్వకల్లు మండలంలో తాగు, సాగునీరు ఇచ్చేందుకు కృషి చేస్తాం.

☛ గ్రామాల్లో ప్రతి ఇంటికి కుళాయి, మరుగుదొడ్లు ఏర్పాటు చేయించి మహిళల ఆత్మగౌరవం పెంచుతాం.

● గౌరు కుటుంబం అంటే తెలియని వారు లేరు.. ఈ ఎన్నికల్లో విజయ వ్యూహాలు ఏమిటి..?

● **గౌరు** : ఎన్నికల్లో గెలవాలంటే వ్యూహం తప్పనిసరి. అభ్యర్థిగా నేను ప్రచారం చేస్తున్నాను. రాజకీయ, ఎన్నికల వ్యూహాలు నా భర్త గౌరు వెంకటరెడ్డి అమలు చేస్తున్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ.. బాబు ష్యూరిటీ, మహాశక్తి పథకం ద్వారా మహిళలకు నెలకు రూ.1,500 (ఒక ఇంట్లో 18 ఏళ్లు పైబడిన ఎందరుంటే అందరికీ) ఇంట్లో ఎందరు పిల్లలు చదువుతున్నా అందరికీ ఒక్కొక్కరికి రూ.15వేలు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, అన్నదాత పథకం కింద రైతుకు ఏడాదికి రూ.20వేలు సాయం, ఇంటింటికి కొళాయి, యువగళం పథకం ద్వారా 20 లక్షల ఉపాధి అవకాశాలు, లేదా రూ.3 వేల నిరుద్యోగ భృతి.. ఇలా సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం చేస్తున్నాము. జాబు రావాలంటే.. బాబు రావాలని యువత విశ్వసిస్తున్నారు.

● జగన్ ప్రభుత్వం ఉర్దూ విశ్వవిద్యాలయం భవనాలు అసంపూర్తిగా వదిలేశారు. దీనిపై మీ సమాధానం.

● **గౌరు** : టీడీపీ ప్రభుత్వం రాగానే చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ఈ పనులు చేపడుతాం. కర్నూలు జిల్లాలో ముస్లిం మైనార్టీలు అధికంగా ఉండటంతో చంద్రబాబు ఉర్దూను రెండో అధికార భాషగా ప్రకటించి డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ స్థాపించారు.

● ఆంధ్రజ్యోతి : టీడీపీ అధినేత ఇస్తున్న భవిష్యత్తుకు గ్యారెంటీ.. బాబు ష్యూరిటీపై ఎలాంటి స్పందన ఉంది...?

● **గౌరు చరిత** : మహిళాలోకం నుంచి ఊహించని స్పందన వస్తోంది. చంద్రబాబు సీఎం అయితేనే మహిళల ఆర్థిక ప్రగతి సాధ్యమని భావిస్తున్నారు. సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు దగ్గరయ్యాయి. పేదలు ధనవంతులు కావాలంటే చంద్రబాబు సీఎం కావాలని ప్రజలు విశ్వసిస్తున్నారు.



● యువనేత లోకేశ్ పాదయాత్ర సందర్భంగా ఎలాంటి సమస్యలు మీ దృష్టికి వచ్చాయి..? వాటి పరిష్కారానికి ఎలాంటి ప్రణాళికలు సిద్ధం చేశారు..?

● **గౌరు** : కల్లూరు మండల గ్రామాల్లో తాగునీటి సమస్య, అభివృద్ధికి నోచుకోని చెన్నరాయునితిప్ప ఆధునికీకరణ పనులు, ఓర్లకల్లు కేంద్రంగా పరిశ్రమలు తెచ్చి యువతకు ఉపాధి చూపడం, గొర్రెలకు బీమా కల్పించడం వంటి పలు సమస్యలు యువనేత నారా లోకేశ్ దృష్టికి వచ్చాయి. మా ప్రభుత్వం రాగానే చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తాను.

● ఖైరెడ్డి టీడీపీలో చేరారు.. ఆయన కూతురు ఖైరెడ్డి శబరి ఎంపీగా పోటీ చేస్తున్నారు. సమన్వయం చేసుకుని ముందుకు వెళ్తున్నారా...?

● **గౌరు** : మా ఇద్దరి లక్ష్యం ఒక్కటే. పాణ్యం ఎమ్మెల్యేగా నేను.. నంద్యాల ఎంపీగా బైరెడ్డి శబరి గెలవాలి. సమన్వయంతో కలిసి ప్రచారంలో ముందుకు సాగుతాం. మేము గెలవాలి.. టీడీపీ అధికారంలోకి రావాలి.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలి. ఇదే అజెండాతో ఇద్దరం కలిసి ముందుకు సాగుతాం.

● రాజకీయాల్లోకి రావడానికి స్ఫూర్తితో ఎవరు.. ఎందుకు రావాలనుకున్నారు..?

● **గౌరు** : నేను రాజకీయాల్లోకి రావడానికి నా భర్త గౌరు వెంకటరెడ్డినే స్ఫూర్తి. ఆయనే నాకు రోల్ మోడల్. ఓ కేసులో నా భర్తకు శిక్ష పడితే.. గౌరు వర్గానికి, ప్రజలకు అండగా.. అందుబాటులో ఉండాలని నేను రాజకీయాల్లో అడుగులు వేశాను. 2004లో నందికొట్కూరు నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టాను. అలా రాజకీయాల్లోకి వచ్చాను.

● టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలను సమన్వయం చేసుకుంటూ ఎలా ముందుకు వెళ్తారు..?

● **గౌరు** : మా నియోజకవర్గంలో ఎలాంటి సమస్య లేదు. సమన్వయంతో ముందుకు వెళ్తున్నాం. మా కూటమి ఏకైక లక్ష్యం సైకో జగన్‌ను ఇంటికి పంపించాలి.. విధ్వంస పాలనకు స్వస్తి చెప్పాలి..

● మీ బాల్యం.. విద్యా, వివాహం, కుటుంబం వివరాలు.. .

● **గౌరు** : మా స్వగ్రామం నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామం. మా అమ్మనాన్నలు సూదిరెడ్డి బాలనాగమ్మ, సూదిరెడ్డి మల్లారెడ్డిలకు కుమారుడు, ఇద్దరు కూతుళ్లు సంతానం. రెండో కూమార్తె నేను. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు మా ఊరి జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివాను. ఇంటర్మీడియట్ కర్నూలులోని ఓ ప్రైవేటు కాలేజీలో చేరితే.. ఇక్కడి వాతావరణం సరిపోక. నందికొట్కూరుకు వెళ్లాల్సి వచ్చింది. అక్కడే ఇంటర్, డిగ్రీ పూర్తి చేశాను. డిగ్రీ అయిపోగానే.. బ్రహ్మణకొట్కూరుకు చెందిన గౌర వెంకటరెడ్డితో నాకు పెళ్లి వివాహమైంది. మాకు కుమారుడు, కూతురు ఇద్దర సంతానం. కొడుకు జనార్దన్ రెడ్డి ఉద్యోగం చేస్తున్నాడు. కూమార్తె చిద్విలా రెడ్డి చదువుకుంటోంది.



పత్తి పంటను పరిశీలిస్తున్న చంద్రబాబు, గౌరు చరిత (ఫైల్)



నారా లోకేశ్ నిర్వహించిన యువగళం పాదయాత్రలో...(ఫైల్)

● మీ కుటుంబ రాజకీయ నేపథ్యం వివరిస్తారా..?

● **గౌరు** : మా తాతయ్యలు గౌరు ఈశ్వర్ రెడ్డి, గౌరు జనార్దన్ రెడ్డి ప్రజలకు సేవల చేయాలనే లక్ష్యంతో రాజకీయాలు చేశారు. అలా మా కుటుంబం జిల్లాలో ప్రముఖ రాజకీయ కుటుంబాల్లో ఒకటిగా మారింది. నా భర్త గౌరు వెంకటరెడ్డి తొలిసారిగా 1999లో నందికొట్కూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఆ తర్వాత ఓ కేసులో శిక్ష పడి జైలుకు వెళ్లాల్సి వచ్చింది. ఆ సమయంలో మా ఆయన కోరిక మేరకు, ఆయన రాజకీయ వారసురాలిగా రాజకీయ రంగ ప్రవేశం చేశాను. 2004లో నేను నందికొట్కూరు నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టాను. 2009లో నియోజకవర్గాల పునర్విభజన వల్ల పాణ్యంకు రావాల్సి వచ్చింది. 2014లో ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలిచాను. 2019లో టీడీపీలో చివరి క్షణంలో చేరడంతో పోల్ మేనేజ్మెంట్ సక్రమంగా చేసుకోకపోవడం వల్ల ఓటమి చెందాల్సి వచ్చింది. తాజా ఎన్నికల్లో మా గెలుపు తథ్యం. సర్వేలు కూడా అదే చెబుతున్నాయి.